# శ్రీముఖలింగం ఉత్సవాలకు 'కంట్రోల్ రూమ్' నిఘా ..

**కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 10:** శ్రీముఖలింగ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'కంట్రోల్ రూమ్' ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన తుది ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సమయంలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ కేంద్రంగా పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. "కంట్రోల్ రూమ్‌లో ప్రతి లైన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి సిబ్బంది విధుల్లో ఉంటారు. తమకు కేటాయించిన విభాగాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును వీరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా, భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెనువెంటనే స్పందించాలి" అని స్పష్టం చేశారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసులకు చెందిన ప్రతినిధులు కంట్రోల్ రూమ్‌లో ఉండి క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల రద్దీని బట్టి క్యూలైన్ల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా వచ్చే దృశ్యాలను కంట్రోల్ రూమ్ నుంచి నిశితంగా పరిశీలిస్తూ భద్రతను పటిష్టం చేయాలని ఏఎస్పీకి సూచించారు. వేడుకల్లో భాగంగా.. 18వ తేదీన జరిగే చక్రతీర్థ యాత్రకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మరోసారి హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ కేవీ రమణ, టెక్కలి డిఎస్పి లక్ష్మణరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | మన్యం | విజయనగరం | విశాఖపట్నం | అనకాపల్లి | అల్లూరి జిల్లా



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెంచాలి

## రీజనల్ ఐ, చెస్ట్ హాస్పిటళ్లలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీ





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 10:**ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యం రోగులకు నాణ్యమైన, విశ్వసనీయమైన వైద్య సేవలు అందించడమేనని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేం ధిర ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ & ఛాతీ (చెస్ట్) ఆసు పత్రులను ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. మందుల లభ్యత, వైద్యులుసిబ్బంది హాజరు, శుభ్రత నిర్వహణ, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. ఆధునిక వైద్య పరికరాల వినియోగం, వాటి ద్వారా అందుతున్న సేవలపై అధికారు లను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను సేకరించారు. రోగులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా సకాలంలో మెరుగైన చికిత్స అందేలా అధికారు లు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించా రు.

సేవల్లో ఎక్కడా నిర్లక్ష్యం తలెత్తకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీలో చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సునీల్ కుమార్, రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. మీనాక్షి, ఏపీఎంఎస్ఐ డీసీ ఈఈ నాయుడు తదితర వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మనాభం మండలంలో ప్రభుత్వ భూముల పరిశీలన


**జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి**



**పద్మనాభం,పెన్ పవర్, ఫిబ్రవరి 10** :పద్మనాభం మండలంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రభుత్వ భూములపై విస్తృతంగా పరిశీలన చేపట్టారు. కృష్ణాపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్1లో ఉన్న ప్రభుత్వ భూములను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే మండలంలోని మరో రెండు మూడు ప్రాంతాల్లోని భూముల స్థితిగతులను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయంలోని రికార్డు రూమును తనిఖీ చేసి, భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్, మండల తహసీల్దార్ కె. ఆనందరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. శ్యామల, మండల సర్వేయర్ డి. రామకృష్ణ, వీఆర్‌వోలు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న బినామీలు.






**బినామిలకు ప్రభుత్వ అనుమతులు అక్కర్లేదా ?**

**ప్రమాదంలో అమాయక గిరిజనులు.**

**లాభాల్లో బినామి గిరిజననేతరులు.**

**అరకులోయ పెన్ పవర్ 10:**ప్రభుత్వం అనుమతి లేకుండా రిసార్ట్స్ నిర్మాణాలు, రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా క్రయ విక్రయాలు. ప్రభుత్వం శాఖ కార్యాలయం రికార్డులో నమోదులేకుండా బినామీల దారుల చాలామణిలు. వివరాలు ఇలా ఉన్నాయి.అరకులోయ మండల కేంద్రంలో బినామీ దారులు భవనా నిర్మాణాలు చేపట్టి,ఆదాయపు పన్నులు సైతం చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. అమాయక గిరిజనులకు ప్రమాదాల్లో పడేస్తున్నారూ. ప్రభుత్వ లబ్ది ఫలాలను దూరం చేస్తున్నారనీ, ప్రభుత్వ పథకాలు, రేషన్ కార్డు రద్దు కాబడుతున్నాయని పలువురు హెచ్చరిస్తున్నారు. అరకులోయలో స్థానిక గిరిజనులు బినామీ అక్రమ నిర్మాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమాయక గిరిజనులకు తెలియక బినామీ దారుల మాయలో పడి నష్టపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు. చిన్నలబుడు పంచాయితీ గొందివలస గ్రామ సమీపంలో కొండపల్లి రిసార్ట్స్ గా చెప్పవచ్చును. గిరిజనుడిని అడ్డుపెట్టుకొని పంచాయతీ అనుమతులు రెవెన్యూ అనుమతులు లేకుండా రిసార్ట్స్ నడుపుతున్నారని, అనుమతులు లేకుండా గిరిజననేతరులు బినామీ రిసార్ట్స్ పై క్రయవిక్రయాలు జరుపుతున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు విక్రయించుకున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ రికార్డులలో రెవెన్యూ రికార్డులలో బినామిదారుల పేరున రిసార్ట్సో నమోదు లేకుండానే చలామణి జరుగుతున్నాయని స్థానిక గిరిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాడేరు జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్ డి ఓ పూర్తిస్థాయిలో విచారణ చేసి కొండపల్లి రిషార్ట్ పై శాఖపరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లాడ్జిలు గ్రామాలు మధ్య ఉండడంతో చుట్టుపక్కల గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామాల్లో గిరిజనుల గ్రామాల్లో స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే అనుమతులు లేకుండా బినామీ పేరుతో నడుపుతున్న కొండపల్లి రిషార్ట్స్ పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంపై కోటమ నాయకులు సత్యదూరమైన వ్యాఖ్యలు మానుకోవాలి : దేవన్



**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 10:**తిరుమల శ్రీవారి లడ్డుపై కూటమి నాయకులు విష ప్రచారం మానుకోవాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం తిరుమల శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఎన్.డి.ఆర్.ఐ, ఎన్.డీ.డీ.బీ ల్యాబులు నివేదిక ఇవ్వడం జరిగిందని. ఎన్.డి.ఆర్.ఐ, ఎన్.డీ.డీ.బీ ల్యాబులు నివేదిక ఇచ్చిన తర్వాత కూడా అబద్ధాన్ని నిజం చేయడం కోసం అసత్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని, మొన్నటి వరకు జంతు కొవ్వు కలిసిందని ప్రచారం చేసిన ఈ కూటమి నాయకులు ఇప్పుడు మరలా శ్రీవారి లడ్డూలో కెమికల్ కలిసిందని, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుంటూ చంద్రబాబు ఏం చెప్తే అదే కరెక్టు అన్నట్టు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన యోగ డే కార్యక్రమంలో యోగ మ్యాట్లకే సుమారు 300 కోట్ల ఖర్చు పెట్టారు అంటే ఎంత అవినీతి చేస్తున్నారో తెలుస్తుందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూ తప్పుదోవ పట్టిస్తూ అనవసరంగా తిరుమల శ్రీవారి లడ్డులో కొవ్వు కలిసిందని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, తిరుమల శ్రీవారి లడ్డుపై నిరాధార ఆరోపణలు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని, వైయస్ జగన్మోహన్ రెడ్డి పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఇందులో భాగంగానే ఇటీవల మాజీ మంత్రి అంబటి రాంబాబు ని ఏ విధంగా ఆయన ఇంటిపై దాడి చేసి ఆయన కుటుంబ సభ్యుల్ని భయభ్రాంతులకు గురిచేసి ఆయన్ని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ తిరిగి అంబటి రాంబాబు పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని, ఈ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తుందని, ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఉన్న భక్తులు కానీ తిరుమల లడ్డుపై ఉన్న గౌరవాన్ని దిగదారుస్తున్నారని, కూటమి నాయకులు వాళ్ల స్వార్ధ రాజకీయాల కోసం దేవున్ని కూడా వాడుకుంటూ దేవుడంటే ఎటువంటి భయం భక్తి లేకుండా వీళు చేస్తున్న పనులు చూస్తుంటే సామాన్య ప్రజలు సిగ్గుపడుతున్నారని, రాజకీయాల కోసం దేవున్ని వాడుకుంటూ రాజకీయాల కోసం అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, తిరుమల శ్రీవారి లడ్డులో జంతు కొవ్వు లేదని నివేదికలు స్పష్టం చేసినా గ్లోబల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ప్రజలకు, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి క్షమాపణలు చెప్పాలనీ, చంద్రబాబు నాయుడు తనకు పిల్లనిచ్చిన సొంత మామ ఎన్.టీ రామారావు గారిని వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత కూడా ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక పార్టీతో జతకట్టి ఎన్నికల్లో పోటీ చేశారు తప్ప ఏనాడు కూడా సింగిల్ గా పోటీ చేసి గెలిచే ధైర్యం లేదని, ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులన్నీ కూడా ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వీళ్ళని ప్రజలే తగిన రీతిలో శిక్షించే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నా పవన్ కళ్యాణ్ కనీసం నోరు మెదపడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల్లో ఎన్నోసార్లు పవన్ కళ్యాణ్ విశాఖపట్నం వచ్చినా కనీసం స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అనవసర ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఇమ్రాన్, మార్టుపూడి పరదేశి, పల్లా చిన్నతల్లి, ఎస్.ఎం.డీ గౌస్, గొందేసి వెంకటరమణారెడ్డి, కొవ్వూరి బాపనయ్య, దామోదర్, ప్రగడ శ్రీనివాస్, రామచంద్ర రాజు, పల్లా సురేష్, బోగాది సన్యాసిరావు, గొందేసి శ్రీనివాస రెడ్డి, మంత్రి శంకర్ నారాయణ, చేగొండి శ్రీనివాస్, బొడ్డ గోవింద్, పూర్ణానంద శర్మ, రావాడ శివ, పెదిరెడ్ల ఈశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, కటికల కల్పన, కొయ్య భారతి, గంగులూరి రోజా రాణి, చిత్రాడ వెంకటరమణ, పిన్నింటి సంతోష్, సారిపల్లి సత్యవతి, పిట్టా రెడ్డి, పేరం రామక్రిష్ణ రెడ్డి, ఎన్నేటి రమణ, కూర్మన్నపాలెం శ్రీనివాసరాజు, బాలకృష్ణ, లోకానాథం తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# చింతపల్లి మండలంలో 308 కిలోల గంజాయి పట్టివేత

**రూ.1.50 కోట్ల విలువ: ఇద్దరు అరెస్టు, నలుగురు పరార్**





**స్టాఫ్ రిపోర్టర్ చింతపల్లి/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి10:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు భారీ దెబ్బకొట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మైదాన ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న 308 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు చింతపల్లి సబ్‌డివిజన్ అడిషనల్ ఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 1.50 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.మంగళవారం చింతపల్లి అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తు నిఘా సమాచారంతో అన్నవరం పోలీస్ స్టేషన్ ఎస్సై కె. సాయిరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కోటగున్నల గ్రామ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహించగా, రెండు ద్విచక్ర వాహనాల ద్వారా అటవీ మార్గాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టుబడిందన్నారు.ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి 308 కిలోల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. అరెస్టు అయినవారిలో కోటగున్నల గ్రామానికి చెందిన పాంగి చంటి, ఒడిశా రాష్ట్రం మల్కానగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ దగుడుపల్లి గ్రామానికి చెందిన వంతల నగేష్ ఉన్నట్లు వెల్లడించారు. విచారణలో ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి కోటగున్నల గ్రామంలో నిల్వ ఉంచి, అక్కడి నుంచి జీకేవీధి మండలం జర్రెల మార్గంగా నర్సీపట్నం మండలం నీలంపేట ప్రాంతానికి చెందిన అడుగుల ప్రకాష్ కుమార్‌కు సరఫరా చేసేందుకు తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు తెలిపారు.ఈ కేసులో మరో నలుగురు నిందితులు పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు వేగవంతం చేసినట్లు చెప్పారు. గంజాయి అక్రమ రవాణాదారులు ప్రధాన రహదారులను తప్పించి అటవీ ప్రాంతాల్లోని చిన్నచిన్న మార్గాలను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఆంధ్రఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రత్యేక బలగాలతో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు.డ్రగ్ ముఠాలపై నిరంతరం ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగుతాయని, అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో సీఐ ఎం. వినోద్ బాబు, ఎస్సై-2 ఎం. వెంకటరమణతో పాటు అన్నవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు మార్కెట్ భరోసా కల్పించాలి ఉద్యాన మిషన్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 10 :** రైతులకు మార్కెట్ సదుపాయం ఉందన్న భరోసా కల్పించిన్నప్పుడే ఉద్యానమిషన్ విజయవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. దీనికోసం పట్టణాల్లో కూరగాయలను విక్రయించేందుకు అవుట్లెట్స్ ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత దశలో విశాఖపట్నం కు పంపించి విక్రయించే విధంగా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. తాము పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందన్న ధీమా వచ్చినప్పుడే, పంటలు మార్చి ఉద్యాన సాగుకు ముందుకు వస్తారని చెప్పారు. దీనికోసం రైతు దగ్గర ధర, మార్కెట్ ధరలను అధ్యయనం చేయాలని సూచించారు.

ఉద్యాన మిషన్ పై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సాయంత్రం సమీక్షించారు. ఉద్యాన మిషన్ కింద జిల్లాలో ఈ ఏడాది పదివేల ఎకరాల్లో అదనంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా రబీలో ఇప్పటికే అదనంగా సుమారు 3,300 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరిగిందని, మరో 700 ఎకరాల్లో చేయాల్సి ఉందని చెప్పారు. ఇదికాకుండా ఖరీఫ్లో 6,000 ఎకరాల్లో ఉద్యాన పంటలను అదనంగా సాగు చేయాల్సి ఉందన్నారు. ఇది సాధించాలంటే 10,000 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. రైతులను చైతన్య పరిచే బాధ్యత అధికారులతో బాటు, మార్గదర్శులపైనా ఉందన్నారు. ముఖ్యంగా మెత్తభూముల్లోనే ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, కోకో, బొప్పాయి లాంటి పంటలతో పాటు సుమారు 30 ఏళ్లపాటు ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్ పామ్ లాంటి పంటల సాగువైపు మళ్లించాలని సూచించారు. ఆయిల్ పామ్ లో అంతర్ పంటల సాగు ప్రయోజనాలను కూడా వివరించాలని కోరారు. వివిధ శాఖల సమన్వయముతో నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. 180 మీటర్లలోపు విద్యుత్ సరఫరా ఉన్న రైతుల జాబితాలను విద్యుత్ శాఖకు ఇచ్చి, వెంటనే క్షేత్ర పరిశీలన చేయించాలనీ చెప్పారు. ఈ ఉద్యాన మిషన్ ను విజయవంతం చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

డిఆర్డిఏ పిడి శ్రీనివాస పాణి, వ్యవసాయ శాఖ జెడి వీటి రామారావు, ఉద్యాన శాఖ డిడి చిట్టిబాబు మాట్లాడుతూ ఉద్యాన మిషన్ లో భాగంగా చేపట్టిన తమ శాఖపరమైన కార్యక్రమాలను వివరించారు.

# శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి ఉచిత ప్రవేశం



- మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్స్ లో సా. 5 గంటల నుండి
- జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- టిటిడి సూపరింటెండెంట్ క్రాంతి కుమార్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్పపవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి,10:** శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి ఉచిత ప్రవేశమని టిటిడి కార్యాలయం సూపరింటెండెంట్ క్రాంతి కుమార్ వెల్లడించారు. టిటిడి ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ఏర్పాటు చేయనున్న సందర్భంగా టిటిడి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్స్, ఏడు రోడ్ల కూడలి వద్ద కన్నుల పండువగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ప్రారంభమవుతోందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులను భక్తుల చెంతకే చేర్చాలనే సదుద్దేశంతో, తిరుమల తిరుపతి దేవస్థానం (ఖఐ) ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో 'శ్రీ శ్రీనివాస కళ్యాణం' అత్యంత వైభవంగా జరగనుందని తెలిపారు.

హిందూ ధర్మం ప్రకారం దేవుడి కళ్యాణం జరిగితే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని, 'కళ్యాణం' అంటేనే 'మంగళం', 'శుభం' అని అర్థమన్నారు. స్వామి వారి కళ్యాణం నిర్వహించడం ద్వారా ఆ ప్రాంతంలోని కరువు కాటకాలు తొలగిపోయని, వర్షాలు బాగా కురిసి, పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని నమ్మకమని వివరించారు. అందుకే దీనిని "లోక కళ్యాణం" అని కూడా పిలుస్తారు చెప్పారు.

ఈ కళ్యాణోత్సవం కోసం సాక్షాత్తు తిరుమల క్షేత్రం నుండి వేద పండితులు, అర్చక స్వాములు విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమల ఆలయం నుండి వచ్చే విగ్రహాలకు, వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీవారి కళ్యాణం జరిపించడం ఈ కార్యక్రమ ప్రత్యేకతన్నారు. దైవ దర్శనం కోసం తిరుమల వెళ్లలేని భక్తులకు, వారి సౌకర్యార్థం అందుబాటులోకి స్వామివారిని తీసుకువచ్చి ఆశీస్సులు అందించాలనే సత్సంకల్పంతో టీటీడీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కళ్యాణోత్సవానికి ప్రవేశం ఉచితమని కావున, శ్రీకాకుళం జిల్లా వాసులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ దివ్యమైన శ్రీ శ్రీనివాస కళ్యాణాన్ని తిలకించి, ఆ దేవదేవుని కృపాకటాక్షాలు పొందవలసిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో టిటిడి కళ్యాణ ప్రాజెక్టు సూపరింటెండెంట్ హరికృష్ణ, కళ్యాణ వెంకటేశ్వర ఆలయం బి. నాగేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ శ్యామ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

# గాజువాక జోన్ పరిధిలో రివ్యూ సమావేశం



- ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, జీవీఎంసీ కమిషనర్
- వార్డు సమస్యలను వివరించిన రాష్ట్ర కార్యదర్శి బోండా

**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 10:** పారిశ్రామిక ప్రాంతం గాజువాక జోన్ పరిధిలో జీవీఎంసీ వారి ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం మాట్లాడుతూ పెట్రోల్ బంక్ నుండి కుర్మన్నపాలెం, గాంధీ బొమ్మ జంక్షన్ నుండి బరియల్ గ్రౌండ్ వర్క్ ఉన్న రోడ్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో తొలిగించిన వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్త 500 కేఎల్ టాంక్ ఎర్పాటు చెయ్యాలని, వార్డు పరిధిలో కమ్యూనిటీ హాల్స్ కొరకు అప్పటి జిల్లా కలెక్టర్ ఇంచార్జ్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించడం జరిగిందని నేటికీ ఎటువంటి పరిష్కారం లేదని, ప్రధాన గెడ్డ బ్యాలెన్స్ వర్కు మరియు రెండు బాక్స్ కల్వర్టులు నిర్మాణం కొరకు స్టాండింగ్ కమిటీ ఎజెండాలో వచ్చేలా కృషి చేయాలని,పార్కులు అభివృద్ధి చెయ్యాలని, గాంధీ బొమ్మ జంక్షన్లో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని, కుర్మన్నపాలెం నుండి వడ్లపూడి వరకు ఉన్న ప్రధాన కాలవను ఆర్ అండ్ బి వారితో డెవలప్ చేయించాలని, వడ్లపూడిలో ఉన్న సిగ్నల్ లైట్లు వినియోగంలోకి తేవాలని పై సమస్యలపై లిఖితపూర్వకంగా ముఖ్య అతిధులకు అందజేసి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తియే విదంగా కృషిచేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ పరిధిలో ఉన్న కార్పొరేటర్లు,జోనల్ కమిషనర్ జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డిపల్లిలో భవితా కేంద్రం సందర్శించిన ఎంపీడీవో కె. రూపేష్

## దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన







**పద్మనాభం, పెన్ పవర్,,ఫిబ్రవరి 10 :** మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. రూపేష్ మంగళవారం రెడ్డిపల్లిలోని మండల భవితా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భవి తా కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అందజేయబడుతున్న వివిధ రకాల సేవలపై వారి తల్లిదండ్రులకు సవివరంగా వివరించారు.

భవితా కేంద్రాల్లో విద్యాభ్యాసం చేయడం ద్వా రా కలిగే ప్రయోజనాలు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు, రవా ణా, ఎస్కార్ట్, రీడర్, గర్ల్ చైల్డ్ అలవెన్స్ వంటి పలు సదుపాయాల గురించి ఎంపీడీవో స్ప ష్టంగా తెలియజేశారు. అలాగే మండలంలో ఉన్న ఇతర దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను భవితా కేంద్రాల్లో చేర్పించి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా భవితా కేంద్రంలో పని చేస్తున్న శ్రీనివాస్ మాస్టారు, ఇక్కడ విద్యన భ్యసిస్తున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో సాధిం చిన ప్రతిభను ఎంపీడీవో గారికి వివరించారు.

మజ్జి భవానీ శంకర్ జిల్లా స్థాయిలో నిర్వహిం చిన ఆర్ట్ అండ్ కల్చరల్ పోటీల్లో క్లే మోడలింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించగా, దిలీప్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే కిలారి భవ్యశ్రీ జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో మూడవ స్థానం సాధించి కేంద్రానికి మంచి పేరు తెచ్చింది.అనంతరం భవితా కేంద్రం ముందున్న పాత పాఠశాల భవనం పూర్తిగా పాడైపోయిన విషయాన్ని శ్రీనివాస్ మాస్టారు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. ఆ భవ నాన్ని మరమ్మతులు చేస్తే భవితా కేంద్ర కార్య కలాపాలకు మరింత ఉపయోగకరంగా ఉంటుం దని పేర్కొంటూ, అవసరమైన పనులకు అను మతులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

# మోక్షం కలిగిన టోకూరు పంచాయతీ కేంద్రానికి రహదారిమార్గం



**అనంతగిరి పెన్ పవర్ ఫిబ్రవరి 10.** అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ' కేంద్రానికి రోడ్డు మోక్షం కలిగింది. టోకూరు పంచాయతీ సర్పంచ్ కిల్లో మొస్య, మాజీ సర్పంచ్ సారా అసిస్టెంట్ దొన్ను, సిపిఎం నాయకులు గెమ్మెలి దేవన్న, ఇంజనీరింగ్ (ప్రాజెక్టు) గణేష్, ఆధ్వర్యంలో మంగళవారం బొర్రా మెయిన్ రోడ్డు భగ్మరవలస నుండి టోకూరు వరకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిల్లో మోస్య మాట్లాడుతూ టోకూరు, కొండిభ పంచాయతీల ప్రజలకు త్వరలోనే రోడ్డు కష్టాలు తీరనునయాని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా అధికారులకు ఎన్నోమార్లు వినతి పత్రాలు అందించిన ప్రయోజనం శూన్యమని తెలిపారు. ఇప్పటికి అధికారులు స్పందించారని స్పందించి రోడ్డు మంజూరు చేసినందుకుగాను సర్పంచ్ కిల్లో మోస్య కృతజ్ఞతలు తెలియజేశారు.

# జీకే వీధి ఏకలవ్య పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్ వేడుకలు




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి10:** అల్లూరి సీతారామరాజు జిల్లా,గూడెం కొత్త వీధి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఘనంగా ఫేర్వెల్ (వీడ్కోలు) వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ రమణారావు మాట్లాడుతూ, విద్యార్థులు వచ్చే పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తూ, కృషి ద్వారా ప్రతీ పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని కూడా ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి మండల ఉన్నతాధికారులు, మండలంలోని వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయాలను గుర్తిస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన విజయం సాధించాలని వారందరూ శుభాకాంక్షలు తెలిపారు.

# అడవి రాజుల బాబు పండగలో కూటమి నేతల భక్తి సందడి!

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి10:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి గూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన అడవి రాజుల బాబు పండగను అత్యంత వైభవంగా, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కూటమి నేతలు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ ఆహ్వానం మేరకు పలువురు కూటమి నేతలు పండగలో పాల్గొన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో అడవి రాజుల బాబులను కొలిచారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోండ్ల చిరంజీవి, రిమేలా పాల్, జనసేన పార్టీ నేతలు కూడా రామకృష్ణ, గబులంగి గణేష్, గబులంగి పరమేశ్వరరావు, గుండ్ల రఘు వంశీ, వనపల ఈశ్వరరావు, సేవ సతీష్, చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబు రావు, పేసా కమిటీ సభ్యులు లకే రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు



